# 20వ వర్ధంతి



స్వర్గీయ నందిగాం విజయలక్ష్మి

"ఈరోజు నువ్వెందుకో మళ్లీ జ్ఞాపకమయ్యావు..
మమ్మల్ని విడిచి వెళ్లిపోయాక 20 ఏళ్లు కన్నీళ్లుగా రాలిపోయాయి..
ఎన్నో నిద్రలేని రాత్రులు ఉదయించని కలలుగా కనుమరుగయ్యాయి..
మరుపు అంటేనే మరణం.. నిన్ను మర్చిపోయే మార్గం ఏమైనా ఉందా..?
కాలాన్ని ప్రశ్నించినా బదులివ్వలేదేమో?
చెప్పలేని గుండెబరువును చేరలేని చిరునామాకు నివేదిస్తున్నాం..
నువ్వెప్పటికీ రావని తెలిసినా నీ అడుగుల అలికిడి కోసం ఎదురుచూస్తున్నాం.."

అమ్మ: నందిగాం గిరిజ  నాన్న: నందిగాం శ్రీశైలం పట్నాయిక్
అన్న: నందిగాం ప్రసాద్  వదిన: నందిగాం మాలతి
తమ్ముడు: నందిగాం అమర్నాథ్  మరదలు: నందిగాం పావని
మేనల్లుడు: నందిగాం విజయ్
మేనకోడళ్లు: నందిగాం నిఖిత, ఆదిత్రి, గాయత్రి


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

సోమవారం 5-8-2024

సంపుటి: 20 సంచిక: 113
పేజీలు: 4 వెల: రూ.1




KILLER
END OF SEASON SALE
FLAT 50% OFF
ON PURCHASE OF 2
BUY 1 GET 30%
PALAKONDA ROAD, SRIKAKULAM




## 'దత్తు'డిని తెచ్చాడు.. భూమి కొట్టేశాడు!

-చనిపోయినవారి ఆస్తి కోసం పాపాలావు నాటకం
-పదేళ్ల తర్వాత నకిలీ పత్రాలతో తెరపైకి దత్తపుత్రుడు
-ఆయన్నుంచి 72 సెంట్లు కొనుగోలు చేస్తూ రిజిస్ట్రేషన్
-రెవెన్యూ మాయతో గగ్గోలు పెడుతున్న అసలు కుటుంబ సభ్యులు
-పోలీస్‌స్టేషన్, కోర్టు మెట్లెక్కినా అడ్డుపడుతున్న రాజకీయ పరపతి


వివరాలు 4లో

Name: Borubhadra Rajarao
DOB: 01/01/1996
Gender: MALE
Address: S/O Gangulu Late, 9-49, Golla Veedhi, Singu
Pradesh, 532185



Name: Gonti Rajarao
Mobile: xxxxxx3087
DOB: 01/01/1996
Gender: MALE
Address: S/O,Gonti Krishnayya, 9-43, Golla Veedhi, Srikaku
Singupuram, Srikakulam, Andhra Pradesh, 532185

## పశువైద్యశాలలు ఏర్పాటుచేయండి





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో 75 శాతం గ్రామీణ ప్రాంతం ఉందని, ఇక్కడి ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం, పశుపోషణ కాబట్టి పశు వైద్యశాలలు ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. సోమవారం పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ పశువుల వైద్యం కోసం దూరంలో ఉన్న డిస్పెన్సరీలకు తరలించడం కష్టసాధ్యమవుతుందని, దగ్గరలోనే ప్రతీ గ్రామానికి పశువైద్యశాలలు నిర్మించే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సంచార పశువైద్యశాలలకు అంబులెన్స్‌లు ఇవ్వాలని, 2014-19 మధ్యకాలంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఈ విధానాన్ని ప్రారంభించారన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లి వేరే రాష్ట్రాల్లో చనిపోతున్నప్పుడు ఎఫ్ఐఆర్ స్థానిక భాషలో రాస్తున్నందున ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఎక్కడైనా ఎఫ్ఐఆర్ ఇంగ్లీష్‌లో ఇచ్చేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు. సముద్రంలో మరణించిన తర్వాత ప్రభుత్వం ఇచ్చే ఎక్స్‌గ్రేషియా కూడా ఏళ్ల తరబడి అందడంలేదని, పింఛన్లలో కూడా మత్స్యకారులకు వయోపరిమితి సడలింపు ఉండాలని ఆయన స్పీకర్‌ను కోరారు.

# జన్మదిన శుభాకాంక్షలు

స్నేహశీలి.. మృదుస్వభావి.. మాకు అత్యంత ఆప్తులు..
సోదర సమానులు, బంగారు వర్తకులు
శ్రీ పాండ్రంకి దేవేంద్రనాయుడు గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు

Happy Birthday



పాండ్రంకి దేవేంద్రనాయుడు
ఉమారుద్ర కోటేశ్వర ఆలయ మాజీ చైర్మన్,
ప్రొప్రయిటర్: శివదేవి జ్యూయలర్స్,
రామమందిరం ప్రక్కన, చంపాగల్లివీధి,
శ్రీకాకుళం, సెల్: 94402 55333

HAPPY BIRTHDAY

కిల్లాన తిరుమలరావు
ప్రొ॥ ఆనందసాయి జ్యూయలరీ

కలిశెట్టి దుర్గారావు
బంగారం వ్యాపారం

కలిశెట్టి రాంబాబు
శివకుమార్, ద్రావకం షాపు

కలిశెట్టి మోహనరావు
ద్రావకం షాపు

కెల్ల రాంబాబు
రియల్ ఎస్టేట్

దన్నాన బాలకృష్ణ
శ్రీదేవి కాస్టింగ్

కొండపల్లి గోవింద
మెరుగుల షాపు

పాట్నూరు సాయిరాం
టిఫిన్ షాపు, కళింగ రోడ్డు

పాట్నూరు గోవింద
కళింగ రోడ్డు, శ్రీకాకుళం

గేదెల పాపారావు
లలితా గోల్డ్, మెయిన్ రోడ్డు

బగాన శ్రీనివాసరావు
ల్యాండ్‌లార్డ్

నడుపూరు కుమార్
IndusInd Bank

సీరపు శ్రీరాములు, మాజీ ఉపసర్పంచ్, జరజాం, ఎచ్చెర్ల మండలం

• ఎడిటోరియల్

# ప్రజారోగ్యంపై పన్ను.. న్యాయమా నిర్మలమ్మా!

తమది సంక్షేమ ప్రభుత్వమని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఘనంగా చాటుకుంటోంది. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పేదవర్గాల ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు వందలు, వేల కోట్ల రూపాయల రాయితీలు, సబ్సిడీలు ఏటా అందిస్తున్నామని ప్రచారం చేసుకుంటోంది. కానీ అదే సమయంలో పళ్లూడగొట్టేలా పన్నులు వసూలు చేస్తోందన్న ఆరోపణలు జోరుగానే వినిపిస్తున్నాయి. అంటే కేంద్రం ఒక చేత్తో ఇచ్చి.. మరో చేత్తో లాక్కుంటోందన్నమాట. ప్రభుత్వ వర్గాలు, అధికార పార్టీలు మాత్రం ఈ ఆరోపణలను అస్సలు అంగీకరించవు. కానీ సాక్షాత్తు కేంద్ర ప్రభుత్వంలో ఒక సభ్యుడిగా ఉంటూ.. విధాన నిర్ణయాల్లో భాగస్వామి అవుతున్న ఒక కేంద్రమంత్రే ఇటువంటి ఆరోపణలు చేయడం కలకలం రేపుతోంది. ఆ కేంద్రమంత్రి మరెవరో కాదు.. గత కొద్దికాలంగా స్వపక్షంలో విపక్షంలా ఉన్నారని ప్రచారం జరుగుతున్న కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ. ఈ మధ్య కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాసిన లేఖ సామాన్యులపై కేంద్రం ఏవిధంగా పన్ను భారం మోపుతోందో స్పష్టం చేసింది. జీవిత బీమా, ఆరోగ్య బీమా పాలసీలపై ప్రభుత్వం ఏకంగా 18 శాతం జీఎస్టీ (వస్తుసేవల పన్ను) వసూలు చేయడాన్ని తన లేఖలో ప్రస్తావించిన గడ్కరీ ఇది సామాన్య, మధ్యతరగతి ప్రజానీకాన్ని భారంగా పరిణమించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాన్ని ఉపసంహరించుకోవడం గానీ.. బాగా తగ్గించడం గానీ చేయాలని విజ్ఞప్తి చేశారు. జీఎస్టీ పన్ను రూపంలో కేంద్రం ప్రజలపై పెనుభారం మోపుతోందని ఈ పన్ను విధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచీ ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. కానీ ఇప్పుడు కేంద్రంలో సీనియర్ మంత్రే ఆ విషయం ప్రస్తావించడం విశేషం. జీఎస్టీ పన్ను శ్లాబుల్లో 18 శాతం దాదాపు గరిష్టస్థాయి పన్ను కావడం గమనార్హం. సామాన్య, మధ్యతరగతి ప్రజలు, వేతన జీవులే జీవిత బీమా (లైఫ్ ఇన్సూరెన్స్), ఆరోగ్య బీమా (హెల్త్ ఇన్సూరెన్స్) పాలసీలు తీసుకుంటుంటారు. దీర్ఘకాలంలో తమ కుటుంబ అవసరాలు, ఆరోగ్య సంబంధిత అవసరాలకు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఈ పాలసీలు అక్కరకు వస్తాయని ఆశతో ఈ పాలసీలను తీసుకుంటుంటారు. ప్రభుత్వాలు కూడా ఈ తరహా పాలసీలు తీసుకుంటే వ్యక్తిగత జీవితానికి, కుటుంబానికి భద్రత ఉంటుందని ఆయా సంస్థల ద్వారా ప్రచారం చేస్తోంది. సగటు భారతీయ పౌరులు ప్రతినెలా తమ ఖర్చులను తగ్గించుకుని మరీ సంపాదనలో కొంత మొత్తాన్ని ప్రీమియంల రూపంలో ఈ పాలసీలకు చెల్లిస్తుంటారు. జీవితం చివరి దశలో ఒకేసారి పెద్దమొత్తం చేతికి అందుతుందని.. దాంతో పిల్లల పెళ్లిళ్లు, చదువులు వంటి భారీ అవసరాల నుంచి గట్టెక్కవచ్చన్న ఆశతో జీవిత బీమా పాలసీలు కడుతుంటారు. మరోవైపు వృద్ధాప్యానికి చేరువవుతున్న కొద్దీ ఆరోగ్య సమస్యలు పెరుగుతుండటం సహజం. ఈ కాలంలో వైద్యం చాలా ఖరీదైన సేవగా మారిపోయింది. ఒక చిన్న శస్త్రచికిత్స చేయించుకుంటే రూ.లక్షపైనే చేతి చమురు వదిలించుకోవాల్సిన పరిస్థితి. అదే పెద్ద పెద్ద ఆరోగ్య సమస్యలు ఎదురైతే లక్షల్లో అయ్యే ఖర్చును తట్టుకోవడం సామాన్యులకు చాలా కష్టం. ఆ ఇబ్బంది లేకుండా వైద్యచికిత్సలకు అవసరమైనప్పుడు నిర్ణీత మొత్తాలు అందించే మెడిక్లెయిమ్ వంటి ఆరోగ్య పాలసీలను చాలా ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేట్ సంస్థలు అందుబాటులోకి తెచ్చాయి. ప్రజలకు వీటిపై పూర్తి అవగాహన కల్పించి మరీ పాలసీలు తీసుకునేలా చేస్తున్నాయి. సామాన్య, మధ్యతరగతి వర్గాలకు ఎంతో ఉపయుక్తమైన ఈ బీమా పాలసీల విషయంలో సంక్షేమ ప్రభుత్వాలను నడుపుతున్నామని చెప్పుకొంటున్న పాలకులు ఉదార దృష్టితో చూడాల్సి ఉంది. కానీ ఆదాయం పెంచుకోవడమే లక్ష్యమన్నట్లు.. పేదలకు వివిధ రూపాల్లో అందిస్తున్న సంక్షేమ పథకాలు అందిస్తున్నాం కనుక వాటికి నిధులు సమకూర్చుకోవడానికి పన్నులు వేసినా ఫర్వాలేదన్నట్లు వ్యవహరిస్తున్నాయి. బీమా పాలసీలపై దాదాపు గరిష్టస్థాయిలో జీఎస్టీ వసూలు చేయడం కూడా ఈ కోవలోకే వస్తుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తన లేఖలో పేర్కొన్నారు. కాగా వ్యక్తిగత ఆరోగ్య పాలసీలపై జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి తగ్గించాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ జనరల్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా రెండు నెలల క్రితం జూన్‌లోనే కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కానీ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్ వంటి వాటిపై జీఎస్టీని ఉదారంగా తగ్గిస్తున్న కేంద్రం ప్రజలకు రక్షణ ఛత్రంగా పనికొస్తున్న బీమా పాలసీలపై పన్ను తగ్గింపు విషయాన్ని మాత్రం పట్టించుకోలేదు. పన్ను మొత్తాల పెరుగుదల కారణంగా గత ఐదేళ్లలోనే ఆరోగ్య బీమా ప్రీమియం గతంతో పోలిస్తే దాదాపు రెండింతలైందని, దీనివల్ల చాలామంది అంత మొత్తాలు చెల్లించలేక మధ్యలోనే ఆగిపోతుంటే.. కొత్తవారు పాలసీలు తీసుకోవడానికి జంకుతున్నారని ఏజెంట్స్ అసోసియేషన్ పేర్కొనడం గమనార్హం. ప్రీమియం మొత్తాలు పెరగడంతో పాలసీలను రెన్యూవల్ చేసుకుంటున్నవారి సంఖ్య 65 నుంచి 75 శాతానికి మించడంలేదని ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలపై జీఎస్టీని హేతుబద్ధీకరించాల్సిన అవసరం ఉందంటూ కేంద్ర ఆర్థికశాఖ మాజీ సహాయమంత్రి జయంత్ సిన్హా నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ కూడా సిఫార్సు చేసింది. కానీ ఇంతవరకు ఈ సిఫార్సులు, విజ్ఞప్తులపై కేంద్ర ఆర్థికశాఖ ఎటువంటి స్పందన వ్యక్తం చేయలేదు. ఒకవైపు జీవిత బీమా, ఆరోగ్యబీమా రంగాలను గ్రామస్థాయి వరకూ పూర్తిస్థాయిలో విస్తరించాలని లక్ష్యాలు నిర్దేశిస్తున్న ప్రభుత్వమే మరోవైపు అధిక పన్నులతో ఆ లక్ష్యాలకు గండికొడుతోందని, సామాన్య ప్రజలకు ఆర్థిక భద్రత లేకుండా చేస్తోందన్న విమర్శలు పెరుగుతున్నాయి.

## చిన్నరావుపల్లిలో రేషన్ అవస్థలు



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

చిన్నరావుపల్లి గ్రామంలో రేషన్ బియ్యం కోసం ప్రజల అవస్థలు పడుతున్నారు. గ్రామంలో సుమారు 148 రేషన్ కార్డులు ఉన్నాయి. అయితే గత ఆరు నెలలుగా 108 కార్డులకు మాత్రమే రేషన్ పంపిణీ చేస్తూ, మిగిలిన కార్డులకు చివరిలో ఎప్పుడో పంపిణీ చేయడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి ప్రధాన కారణం మిగిలిన 40 హౌస్‌హోల్డ్ మ్యాపులో వేరే గ్రామంలో నమోదయ్యాయని, అందువల్లనే ఆలస్యమవుతుందన్నారు. ఇది ఇలా ఉండగా ప్రతి నెల 4, 5 తేదీలలో గ్రామంలో రేషన్ పంపిణీ నిర్వహిస్తున్నారు. అయితే మిగిలిన 40 కార్డులకు మాత్రం ప్రతి నెల 14, 15 తేదీల్లో రేషన్ పంపిణీ చేయడంతో వారు ఇబ్బందులు పడుతున్నాడు. 40 కార్డులు హౌస్ హోర్డ్ మ్యాప్‌లో ఎవరెవరివి వేరే గ్రామానికి వెళ్లాయో వారికే ముందు రేషన్ పంపిణీ చేయడం విడ్డూరం. దీనివల్ల మిగిలిన లబ్ధిదారులు తమ కార్డు తమ గ్రామంలో హౌస్ హోల్డ్ మ్యాప్‌లో నమోదైన తమకు బియ్యం ఇవ్వకుండా లేట్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సీఎస్ఆర్ఐ వెంకటేష్‌ను ఫోన్లో సంప్రదించగా, త్వరలో ఒక నిర్ణయానికి వచ్చి, లబ్ధిదారుకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

## రెండు నెలల్లోనే లక్ష్యం పూర్తి

### రాజాంలో 1100 మొక్కల నాటే కార్యక్రమం

(సత్యంన్యూస్, రాజాం)

పర్యావరణ పరిరక్షణకు రెండు నెలల్లో రాజాం పట్టణంలో వెయ్యి మొక్కలు నాటాలన్న లక్ష్యాన్ని ఇప్పటికే అధిగమించి ఇప్పటికే 1100 మొక్కలు నాటామని పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు చెప్పారు. దీన్ని ఇక్కడితో నిలిపివేయకుండా కొనసాగిస్తామన్నారు. లక్ష్యాన్ని పూర్తి చేసిన సందర్భంగా సోమవారం అమ్మవారి కాలనీ వెనుకనున్న రామాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమానికి సహకరించిన మున్సిపల్ కమిషనర్, సిబ్బందితోపాటు భాగస్వాములైన స్వచ్ఛందసంస్థలు, పౌరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంకి చైతన్యకుమార్, పందూరి వేణుగోపాల్, మానేం వెంకటేష్, ముప్పిడి శ్రీను, పెద్ది గోవిందరావు, రమేష్, శివ రామకృష్ణ మాస్టర్, లెంక శ్రీహరినాయుడు, గడే అప్పలనాయుడు పాల్గొన్నారు.



## కిడ్నీ వ్యాధిగ్రస్తునికి సాయం

(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

కవిటి మండలం డి.గొనపపుట్టుగ పంచాయతీ వి.జల్లుపుట్టుగకు చెందిన గణపతి మజ్జిది నిరుపేద కుటుంబం. గణపతి గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఉన్నంతలో అప్పుచేసి మందులకు ఖర్చు పెట్టారు. ఇప్పుడు ఆసుపత్రికి వెళ్లడానికి కూడా డబ్బులు లేక దాతల కోసం ఎదురు చూస్తున్నారని గ్రామ యువత ఎస్‌జీఎఫ్ దృష్టికి తీసుకురావడంతో తక్షణ సహాయంగా సంస్థ సహాయ నిధి నుంచి రూ.10వేలు గ్రామ పెద్దలు పండి దేవేంద్రమూర్తి, మోహన్‌సాహు సమక్షంలో అందజేశారు. నిరుపేద అయిన గణపతి కుటుంబానికి దాతలు సహాయం అందించాలని కోరారు.



## తెలుగు భాష ఉన్నతికి యువతదే కీలక బాధ్యత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగు భాషా దినోత్సవం సమీపిస్తున్న ఈ తరుణంలో, తెలుగుదనానికి పేరొందిన కరుణశ్రీ వంటి సహజ కవులను తలచుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా యువతపై ఉందని వక్తలన్నారు. ఆయన జయంతి ఉత్సవ సభను శ్రీకాకుళం తెలుగు రచయితల వేదిక ఆదివారం నిర్వహించింది. శాంతినికేతన్ కళాశాల ఆవరణలో ఆ విద్యాసంస్థ అధినేత, తెరవే గౌరవ సలహాదారు సురంగి మోహనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జంధ్యాల శరత్‌బాబు ముఖ్య వక్తగా మాట్లాడారు. పద్య, గద్య రచనల పరంపరతో చదువరులను అలరించిన జంధ్యాల పాపయ్య శాస్త్రి సాహితీ మూర్తిమత్వాన్ని ఉదాహరణలతో వివరించారు. సంస్థ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి నిర్వహణలో విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు సభావేదిక నుంచి బహుమతి ప్రదానం చేశారు. కళాశాల ప్రధాన అధ్యాపకుడు అప్పలరాజుతో పాటు కవులు కోమలరావు, మంగిపూడి శ్రీనివాసరావు, ఇద్ది పాపయ్య, నిక్కు హరి సత్యనారాయణ, ఐ.ఎన్.డి.ప్రసాద్, ముట్నూరి ఉపేంద్ర శర్మ, వి.రాజారావు, పూడి జనార్ధనరావు, తంగి ఎర్రమ్మ, లలితారెడ్డి, ఉమాకవి, బి.జగన్నాథరావు, సోదవరం ఈశ్వరరావు తమ అభిప్రాయాలు తెలిపారు.



## లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి సేవలు నిరుపమానం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి సేవలు నిరుపమానమని, నిరాశ్రయులు, నిరుపేదల అభ్యున్నతికి వారు అందిస్తున్న సేవలు ఎంతో సంతృప్తినిస్తున్నాయని 361ఎ డిస్ట్రిక్ గవర్నర్ ఎన్‌వీబీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. డాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లాకు వచ్చిన గవర్నర్లు శాంతినగర్ కాలనీలోని స్విమ్మింగ్ పూల్ ఆవరణలో లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం నరసన్నపేటకు చెందిన 10మంది అంధులకు నిత్యావసర కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా అంధులు పాడిన పాటలకు ముగ్ధులై వారికి నగదు సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు హారికా ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి ఆధ్వర్యంలో 5వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు వివరించారు. రీజనల్ చైర్మన్ కరణం శోభారాణి మాట్లాడుతూ నగరాన్ని గ్రీన్‌సిటీగా మార్చాలన్న లక్ష్యంతో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గవర్నర్-1 సూర్యప్రకాశరావు, మాజీ వైస్ ఛాన్సలర్ ఎస్ఆర్‌కె రామకృష్ణారావు, ఆర్.రంగనాథం, లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి అధ్యక్షులు వావిలపల్లి జగన్నాథంనాయుడు, ఉపాధ్యక్షులు తర్లాడ అప్పలనాయుడు, కార్యదర్శి మణిశర్మ, ట్రెజరర్లు ఎస్.లక్ష్మీపతి, కె.లక్ష్మీకాంత్, మజ్జి సుమన్, లక్ష్మణ్, నిహార్‌నాయుడు, జీఎన్‌టీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.




# నిరాశపరిచింది!

సాంకేతిక వర్గం: తమిళంలో మంచి పేరున్న హిప్ హాప్ తమిళ.. తెలుగులో ఇప్పటిదాకా తనదైన ముద్ర వేయలేకపోయాడు. 'బడ్డీ' కూడా తన ప్రత్యేకతను చాటలేకపోయింది. పాటలు ఒక్కటీ రిజిస్టర్ కావు. రెండు పాటలైతే మరీ విసిగిస్తాయి. నేపథ్య సంగీతం ఓ మోస్తరుగా అనిపిస్తుంది. కృష్ణన్ వసంత్ ఛాయాగ్రహణం చాలా డల్లుగా అనిపిస్తుంది. తెరంతా మసకబారినట్లుగా విజువల్స్ సాగాయి. ప్రొడక్షన్ వాల్యూస్ సాధారణంగా అనిపిస్తాయి. తమిళంలో నిర్మాతగా మంచి పేరుండి.. పెద్ద పెద్ద సినిమాలు తీసే జ్ఞానవేల్ రాజా ఈ సినిమా విషయంలో రాజీ పడ్డట్లున్నాడు. రైటర్ కమ్ డైరెక్టర్ శామ్ ఆంటన్ నిరాశపరిచాడు. హాలీవుడ్లో.. కోలీవుడ్లో తీసిన కథను తెలుగు నేటివిటీకి తగ్గట్లు అడాప్ట్ చేసే ప్రయత్నం ఏదో చేశాడు కానీ.. పెద్దగా ప్రయోజనం లేకపోయింది. మినిమం ఎమోషన్ లేకుండా కథను.. పాత్రలను తీర్చిదిద్దడంతో 'బడ్డీ' ఏ కోశాన ప్రేక్షకులను ఎంగేజ్ చేయదు. రైటింగ్ దగ్గరే సినిమా తేలిపోయింది. టేకింగ్ కూడా గొప్పగా లేకపోవడంతో సినిమా సాధారణంగా తయారైంది.

టెడ్డీబేర్లోకి మనిషి ఆత్మ వెళ్లడం..అది రకరకాల విన్యాసాలు చేయడం అన్నది గమ్మత్తుగా అనిపించే విషయం. 'ఈగ' సినిమాలో మనిషి ఆత్మ ఈగలోకి వెళ్లడం.. దాని తర్వాత పరిణామాలను రాజమౌళి అద్భుతంగా చూపించాడు. ఈగ రంగప్రవేశానికి ముందే హీరో పాత్రతో ప్రేక్షకులకు ఒక ఎమోషనల్ కనెక్ట్ ఏర్పరుస్తాడు. ఆ పాత్ర చనిపోతుంటే గుండె కలుక్కుమంటుంది. తర్వాత ఈగలోకి హీరో ఆత్మ వచ్చిన దగ్గర్నుంచి ప్రతి సన్నివేశంలో క్యూరియాసిటీ కలిగిస్తూ.. ఈ ఈగ ఎలా సర్వైవ్ అవుతుంది.. తన లక్ష్యాన్ని ఎలా నెరవేర్చుకుంటుంది అన్నది నోరెళ్లబెట్టి చూసేలా తెరపై ప్రెజెంట్ చేశాడు జక్కన్న. బడ్డీలో 'ఈగ' స్థానంలోకి టెడ్డీ బేర్ వచ్చింది. కానీ ఈ పాత్రతో కనీస స్థాయిలో కూడా ప్రేక్షకులకు ఎమోషనల్ కనెక్ట్ ఏర్పడదు.

**కథ:**

ఆదిత్య (అల్లు శిరీష్) ఓ పైలట్. ప్రొఫెషన్లో అతడికి చాలా మంచి పేరుంటుంది. ఎయిర్‌పోర్టులో ఏటీసీగా కొత్తగా చేరిన ప్రియ (గాయత్రి భరద్వాజ్)తో అతడికి పరిచయం ఏర్పడుతుంది. వృత్తిపరంగా తనకు ప్రతి సందర్భంలోనూ అండగా నిలిచిన ఆదిత్యతో ప్రియ ప్రేమలో పడుతుంది. ప్రియను చూడకుండానే ఆదిత్య ఇష్టపడతాడు. కానీ అతణ్ని ఆమె చూస్తుంది. మంచి సందర్భంలో తనను కలవాలనుకుంటుంది. ఈలోపు ఒక మెడికల్ మాఫియా వలలో ప్రియ చిక్కుకుని కోమాలోకి వెళ్లిపోతుంది. ఆ స్థితిలో ఆదిత్య ఒకప్పుడు బహుమతిగా ఇచ్చిన టెడ్డీ బేర్లోకి ప్రియ ఆత్మ వెళ్తుంది. ఆ తర్వాత ఈ టెడ్డీ బేర్.. ఆదిత్యతో స్నేహం చేసి ప్రియను కాపాడ్డానికి ప్రయత్నిస్తుంది. ఈ ప్రయత్నం ఎంతమేర సఫలమైంది.. ఇంతకీ మెడికల్ మాఫియా చేస్తున్న స్కామ్ ఏంటి.. ప్రియ బాడీతో వాళ్లు ఏం చేయాలనుకున్నారు.. ఈ ప్రశ్నలన్నింటికీ తెర మీదే సమాధానం తెలుసుకోవాలి.

**ఓ మంచి హిట్ కోసం చాన్నాళ్లుగా ఎదురు చూస్తున్నాడు అల్లు శిరీష్. చివరగా 'ఊర్వశివో రాక్షసివో' సినిమాతో పలకరించాడతను. అది ఓ మాదిరిగా ఆడింది. ఇప్పుడు శిరీష్ నుంచి 'బడ్డీ' సినిమా వచ్చింది. ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి.**

**కథనం-విశ్లేషణ:**

ఒక మనిషి ఆత్మ మరో వ్యక్తి శరీరంలోకి వెళ్లి తన లక్ష్యాన్ని నెరవేర్చుకునే ఫాంటసీ సినిమాలు ఇండియాలో వందల సంఖ్యలో వచ్చాయి. నిజ జీవితంలో సాధ్యం కాని విషయాలను ఇలా తెర మీద చూపిస్తే ప్రేక్షకులకు గమ్మత్తుగా అనిపిస్తుంది. అందుకే ఫాంటసీ సినిమాల సక్సెస్ రేట్ బాగుంటుంది. ఐతే ఫాంటసీ కథ అనగానే లాజిక్ గురించి ఎక్కువ పట్టించుకోకూడదు అనేది వాస్తవమే అయినా.. ఈ విషయాన్ని మరీ తేలిగ్గా తీసుకుని కథను.. పాత్రల్ని ఎలా పడితే అలా నడిపిస్తే మొత్తం వ్యవహారం సిల్లీగా మారుతుంది. 'బడ్డీ' సినిమా అంతటా అలాంటి సిల్లీనెసే కనిపిస్తుంది. ఒక వ్యక్తి చనిపోయాక ఆత్మ మరొకరిలోకి వెళ్లడం అంటే మనకు అలవాటే కానీ.. ఓ వ్యక్తి కోమాలోకి వెళ్లగానే ఆత్మ బయటికి వచ్చి మరో వ్యక్తిలోకి చేరడం లాజికల్‌గా అనిపించదు. 'ఎందుకంటే ప్రేమంట' చిత్రంలో ఇలాంటి పాయింటే చూపిస్తే ప్రేక్షకులకు రుచించలేదు. మళ్లీ 'బడ్డీ'లో అదే ట్రై చేశారు. చేస్తే చేశారు కానీ.. ఒక ఆత్మ టెడ్డీ బేర్లోకి వచ్చి ఆ బొమ్మ మామూలు మనిషిలాగే తిరిగేస్తుంటే.. మాట్లాడేస్తుంటే హీరో సహా చుట్టూ ఉన్న వాళ్లెవ్వరూ పెద్దగా ఆశ్చర్యపడకపోవడం.. అందరూ దాంతో నార్మల్‌గా వ్యవహరించడమే విడ్డూరంగా అనిపిస్తుంది. దీని వల్ల క్యూరియాసిటీ పెంచాల్సిన సీన్లన్నీ కూడా తేలిపోయాయి. ఇక హీరోకు.. ఈ బొమ్మకు మధ్య ఎమోషనల్ కనెక్ట్ ఏర్పరచడంలోనూ దర్శకుడు పూర్తిగా విఫలమయ్యాడు. దాని వల్ల 'బడ్డీ' ఏ దశలోనూ ప్రేక్షకులను ఎంగేజ్ చేయలేకపోయింది.

తనది కాని ప్రతీకారాన్ని లేదా.. లక్ష్యాన్ని హీరో తీసుకునే సినిమాలేవీ కూడా ప్రేక్షకుల్లో ఉద్వేగాన్ని కలిగించవు. 'బడ్డీ'లో అయితే మరీ విడ్డూరంగా ఒక టెడ్డీ బేర్ కోసం హీరో ప్రాణాల మీదికి తెచ్చుకుని ఎన్నో సాహసాలు చేసేస్తుంటాడు. పోనీ ఆ బొమ్మలో ఉన్నది తాను ప్రేమించిన అమ్మాయి ఆత్మే అని అయినా తనకు తెలుస్తుందా అంటే అదీ కాదు. మరి ఎందుకు అతను దేశాలు దాటి ప్రమాదకర విన్యాసాలు చేస్తాడో? సినిమాలో అంతో ఇంతో ఆసక్తి రేకెత్తించేదంటే టెడ్డీ బేర్ క్యారెక్టరే. జై బాలయ్య అంటూ భారీ మెషీన్ గన్ను పేల్చే సన్నివేశం ఒకటి సినిమాలో కొంచెం పేలింది. అక్కడ మాత్రమే ప్రేక్షకుల్లో కొంచెం హుషారు పుడుతుంది కానీ బేసిగ్గా కథలో మాత్రం ఏ విశేషం లేదు. ప్రమాదకర ప్రయోగాలు చేసే మెడికల్ మాఫియా చుట్టూ బోలెడన్ని కథలు చూశాం ఇలాంటివి. హీరో హీరోయిన్లతో పాటు విలన్ పాత్రలోనూ విశేషం కనిపించకపోవడంతో ఏదో సినిమా నడుస్తుంటుందే తప్ప.. తర్వాత ఏం జరుగుతుందనే ఆసక్తి మాత్రం ఏ దశలోనూ ప్రేక్షకుల్లో కలగదు. దీంతో పోలిస్తే 'టెడ్డీ' పేరుతో వచ్చిన తమిళ ఒరిజనలే చాలా బెటర్‌గా అనిపిస్తుంది. రీమేక్ కాని రీమేక్‌లా తీర్చిదిద్దిన తమిళ దర్శకుడు శామ్ ఆంటన్ మన ప్రేక్షకులను ఎంటర్టైన్ చేయలేకపోయాడు.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...

**నటీనటులు:**

తన చివరి చిత్రం 'ఊర్వశివో రాక్షసివో'లో మంచి హుషారైన పాత్రలో అల్లు శిరీష్ ఆకట్టుకున్నాడు. కానీ 'బడ్డీ'లో అతను ప్రత్యేకంగా చేయడానికి ఏమీ లేకపోయింది. చాలా వరకు ముభావంగా కనిపించే పాత్రలో శిరీష్ డల్లుగా కనిపించాడు. పెద్దగా హావభావాలు పలికించలేకపోయాడు. ఓవరాల్ గా తన పాత్ర కూడా అంత ఎగ్జైట్మెంట్ కలిగించేలా లేదు. హీరోయిన్ గాయత్రి భరద్వాజ్ కు కథలో కీలక పాత్రే దక్కినా.. ఆమె తనదైన ముద్ర వేయలేకపోయింది. తన లుక్స్ ఒక్కోసారి ఒక్కో రకంగా ఉన్నాయి. తొలి అరగంట తర్వాత కథ ప్రకారం ఆమె పాత్ర సైడ్ అయిపోయింది. హీరోయిన్ కంటే ఇంకో సైడ్ క్యారెక్టర్ చేసిన అమ్మాయి ఆకర్షణీయంగా కనిపించింది. విలన్ అజ్మల్ అమీర్ బాగానే చేశాడు. ముకేష్ తనకు అలవాటైన పాత్రలకు భిన్నంగా కనిపించాడిందులో. కామెడీ టచ్ ఉన్న తన పాత్ర పర్వాలేదు. ఆలీ ద్వితీయార్థంలో ఎంట్రీ ఇచ్చి నవ్వించడానికి ట్రై చేశాడు కానీ.. పెద్దగా ప్రయోజనం లేకపోయింది.

# ఉద్యమ ఆహ్వాన పత్రం ఆవిష్కరణ

(సత్యంన్యూస్, సారవకోట)

ఈనెల 12న జలుమూరు మండలం ఎస్టీ మాకివలస ఆదివాసీల భూమి సమస్య పరిష్కారం కోసం ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో వినూత్న నిరసనకు పిలుపునిస్తూ సోమవారం కరపత్రం సారవకోటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యోగి మాట్లాడుతూ ఉద్యమానికి జిల్లాలో ఉన్న ఆదివాసీలకు పౌర, ప్రజాస్వామికవాదులు, మేధావులకు రాజకీయ పార్టీలకు ఆదివాసీలకు అండగా నిలబడమని ఉద్యమ ఆహ్వాన పత్రిక ముద్రించి పంచుతూ విస్తృతంగా పెద్ద ఎత్తున ఆదివాసీలను సమీకరిస్తామన్నారు. ఓన సత్యనారాయణ గుప్త ఆదివాసీలకు నిలువు నీడ లేకుండా చేసే పద్ధతిపై పోరాడుతున్నామన్నారు. పాత కాలం నాటి రికార్డులు దొంగ రికార్డుల సృష్టించి ఆదివాసీలను అశాంతికి గురి చేస్తున్నారన్నారు. ఆయనపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి ఆదివాసీలు సాగుచేస్తున్న భూములపై ఆదివాసులకి అన్ని రకాల హక్కులు కల్పించి తక్షణమే వారు సాగులో ఉన్న భూములకు పట్టాల మంజూరు చేయాలన్నారు. దీనిపై గతంలో తహశీల్దార్, ఆర్డీఓ దృష్టికి కూడా తీసుకువెళ్లామన్నారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇప్పుడు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈ నిరసనర్యాలీ చేపట్టేందుకు సిద్ధమవుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఆదివాసీలు, విద్యార్థులు మేధావులు అందరు కూడా సంఘీభావంగా పాల్గొని మాకివలస ఆదివాసీలకు రక్షణగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్.షణ్ముఖరావు, జనసేన జిల్లా నాయకులు, ఎస్టీ మాకివలస గ్రామ ఆదివాసీలు పాపారావు, సురపు నాయుడు, హరీష్, ఆదివాసీ జిల్లా నాయకులు శ్రీను, రామకృష్ణ, బాలకృష్ణ, సింహాచలం, మధు, గోవిందు, యర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రపోటీల్లో జయకేతనం ఎగురవేయండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

శ్రీకాకుళం ఆతిథ్యంలో ఈనెల 17 నుంచి జరగనున్న ఏపీ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జయకేతనం ఎగురవేసి జిల్లాకు గౌరవాన్ని, కీర్తిప్రతిష్టలను నిలబెట్టాలని శ్రీకాకుళం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు పేర్కొన్నారు. జిల్లా స్థాయి జూనియర్స్, సబ్‌జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఉత్సాహభరితంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి రికార్డుస్థాయిలో క్రీడాకారులు తరలివచ్చారు. 160 మందికి పైగా క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కలిదిండి మాట్లాడుతూ మొట్టమొదటి రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు శ్రీకాకుళం నుంచే ఆరంభం కానుండంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. రాష్ట్ర నలుమూలల నుంచి ఇక్కడకు హాజరయ్యే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేసేలా చూడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.

శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్–2024 పోటీలను విజయవంతం చేయాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి పిలుపునిచ్చారు. పోటీల నిర్వహణకు దాతల చేయూతతో పాటు ప్రభుత్వం నుంచి సాయం అందినట్టయితే జిల్లా గర్వకారణంగా నిలిచే విధంగా ఏర్పాట్లను చేయవచ్చన్నారు.

### 7 నుంచి శిక్షణా శిబిరాలు

జిల్లా జట్లకు ఎంపికయ్యే క్రీడాకారులకు ఈ నెల 7 నుంచి 16వ తేదీ వరకు శిక్షణా శిబిరాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ అన్నారు. శ్రీకాకుళం ఆతిథ్యంలో జరిగే రాష్ట్రపోటీలు కావడంతో జిల్లా జట్ల గెలుపే లక్ష్యంగా వసతి, భోజన సదుపాయాలను కల్పిస్తు శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కేశవరావుపేట జెడ్పీహెచ్ స్కూల్‌లో బాలురుకు, ఇప్పిలి జెడ్పీహెచ్ స్కూల్‌లో బాలికలకు శిక్షణా శిబిరాలను ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మెట్ట తరుపతిరావు, బొడ్డేపల్లి సురేష్‌కుమార్, ఎం.ఆనంద్ కిరణ్, అన్నెపు రాజగోపాల్, గురుగుబెల్లి రాజశేఖర్, ఎ.ఢిల్లీశ్వరరావు, మహంతి, సతీష్‌రాయుడు, మల్లేశ్వరరావు, తోటారావు, పెంటయ్య, మధుసూదన్ పాల్గొన్నారు.

# నూతన నాయకులకు ఆత్మీయ సత్కారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తొలిసారి ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులను ఎచ్చెర్ల నియోజకవర్గం పైడిభీమవరం, నారువ గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ మైనర్ రాజు, ఆయన కుమారుడు టి.కె.రాజు, టి.ఎస్.ఎన్.రాజుల ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం చేశారు. విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు, రణస్థలం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎమ్మెల్యే అతిథి విజయలక్ష్మి గజపతిరాజు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌లతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ తెలుగుదేశం–జనసేన– బీజేపీ కూటమికి అఖండ మెజారిటీ ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆత్మీయ కలయికలో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అరసవల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడం నా బాధ్యత
- కనీస మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజల ఇబ్బందులను తీరుస్తా
- అరసవల్లిలో పర్యటించిన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

అరసవల్లిని అన్నివిధాల అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అరసవల్లి ప్రాంతంలో సోమవారం ఆయన కమిషనర్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యే శంకర్‌ను ఆహ్వానించి మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ సూర్యనారాయణ స్వామి దేవాలయం ఉన్న అరసవల్లిలో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించలేని స్థితిలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని శంకర్ పేర్కొన్నారు. అరసవల్లి పరిధిలో అనేక సమస్యలు గుర్తించామని చెప్పారు. కనీసం మౌలిక సదుపాయాల కల్పనలో కూడా గత వైకాపా ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ప్రజలకు సరైన రోడ్లు, కాలువలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి తెచ్చారని వివరించారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. తన విజయం కోసం సహకరించిన అరసవల్లి ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ చల్లా ఓబులేషు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

## జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఇద్దరు ఎంపిక



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు అనంతపురం జిల్లా తాడిపత్రిలో న్యూ ఆంధ్రప్రదేశ్ టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి టైక్వాండో పోటీల్లో శ్రీకాకుళం క్రీడాకారులు సత్తా చాటి పథకాలను సాధించారు. పథకాలు సాధించిన క్రీడాకారులకు తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించిన వీరు జాతీయ స్థాయిలో పాల్గొనున్నారు. వీరిని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ధర్మాన కృష్ణదాస్, మెంటాడ సాంబమూర్తి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ముఖ్య సలహాదారు పి.సుందరరావు మాస్టారు, క్రీడాకారులు అభినందించారు. కోచ్ మేనేజర్‌గా బి.ధనుంజయరావు, నీరజ వ్యవహరించారు.

సబ్ జూనియర్ బాలుర విభాగంలో అండర్–21 విభాగంలో వరుసగా పెద్దిన గగన్ సిల్వర్ మెడల్, అండర్–27 విభాగంలో కారే సాక్షాత్ బ్రాంచ్ మెడల్ కైవసం చేసుకున్నారు. బాలికలు అండర్–16 విభాగంలో శిమ్మ జోషిత సిల్వర్ మెడల్, అండర్ 18 భాగంలో ఆరంగి లహరి బ్రాంజ్ మెడల్, అండర్–20 భాగంలో దువ్వ త్రివేణి బ్రాంచ్ మెడల్, అండర్ 35 విభాగంలో గొండు మోక్షాన్విత బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. క్యాడిట్ బాలురు విభాగంలో వరుసగా అండర్ 32 విభాగంలో దువ్వ లీలామాధవ్ సిల్వర్ మెడల్, అండర్ 37లో కారి మోక్షిత్ గోల్డ్ మెడల్, అండర్ 41 విభాగంలో పల్లి సాయికృష్ణ సిల్వర్ మెడల్ సాధించారు. క్యాడిట్ బాలికల విభాగంలో అండర్ 29 విభాగంలో పెద్దిన యశితా బంగారు పతకం కైవసం చేసుకుంది.

# ప్రభుత్వాల నిర్లక్ష్యం ఉత్తరాంధ్రకు శాపం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

వివిధ పార్టీల ప్రభుత్వాలు ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేశాయని, ఫలితంగా ప్రజలు వెనుకబాటుతనంతో ఉన్నారని ప్రజా, వామపక్ష సంఘాల ప్రతినిధులు అన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుపై 'ఉత్తరాంధ్ర ఆకాంక్షలు–కార్యాచరణ' పేరుతో ఉపాధ్యాయులు పేడాడ కృష్ణారావు, మిస్కా కృష్ణయ్య, న్యాయవాది చౌదరి లక్ష్మణరావు ఆధ్వర్యంలో అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావులు మాట్లాడుతూ అన్ని రంగాల్లో ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేసిన పాపం పాలకులదేనన్నారు. విశాఖ ఉక్కు, రైల్వేజోన్ల విషయంలో ఈ విషయం స్పష్టం చేస్తుందని, ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులకు నిధులు లేక కునారిల్లుతున్నాయని, ప్రమాదకరమైన పరిశ్రమలకు ఉత్తరాంధ్ర కేంద్రంగా మారిందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీ జగన్నాధరావు అన్నారు. అన్ని సంఘాలు కలిసి పోరాడి ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చాలని ఉత్తరాంధ్ర పోరాట సమితి కన్వీనర్ సన్నశెట్టి రాజశేఖర్ అన్నారు. వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, నీలకంఠం, పి.దానేషు, కె.రాంగోపాల్, బొడ్డేపల్లి మోహనరావు, ఎస్.వీరాస్వామి, ఆర్.చిరంజీవి, బీన ఢిల్లీరావు, ఆర్.లోకనాథం, అమ్మ రామకృష్ణా తదితరులు పాల్గొన్నారు.



# తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి కావాల్సిన అన్ని రకాల పోషక విలువలు తల్లిపాలలో ఉంటాయని, తల్లి బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపే బిడ్డకు ముర్రుపాలు ఇవ్వాలని ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి తెలిపారు. గుజరాతీపేట సెక్టార్ 32వ వార్డు హయాతినగరం అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించి తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో శోభారాణి మాట్లాడుతూ మాట్లాడుతూ బిడ్డకు పాలివ్వడం వల్ల తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. వార్డు ఇన్‌చార్జ్ తోణంగి వెంకన్నయాదవ్ మాట్లాడుతూ చిన్నారుల్లో తల్లిపాలతోనే వ్యాధి నిరోధకశక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బూర బీన, కింతలి మన్మధరావు, లావేటి రమేష్, కురిటి అప్పారావు, పి.సూరిబాబు, జనసేన నాయకులు అలబాన అప్పలరాజు, దుక్క రాజు, సూపర్‌వైజర్ కె.ఉమ, ఎంఎస్‌కే జ్యోత్స్న, కొర్నాన లక్ష్మి, కె.శ్యామలాదేవి, హిమబిందు, జి.రాజేశ్వరి, సీహెచ్ శ్రీదేవి పాల్గొన్నారు.

# 6న సాగునీరు విడుదల

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

శ్రీకాకుళం నియోజకవర్గ రైతాంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అనేక చర్యలు చేపడుతున్నారని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నారాయణపురం తోటపల్లి సాగునీరు విడుదలకు తాను సైతం అధికారులతో మాట్లాడానని, నారాయణపురం, తోటపల్లి ప్రాజెక్టుల నుంచి దిగువ ప్రాంతాలకు సాగునీరు విడుదలకు నార్త్ కోస్ట్ సీఈవోతో మాట్లాడానన్నారు. మంగళవారం నాటికి సాగునీటి విడుదలకు సీఈవో అంగీకరించారని, రైతాంగం సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# సేవలకు మారుపేరు 'లయన్స్'

## - నగర కమిషనర్ చల్లా ఓబులేసు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సేవలను మరింత విస్తృతం చేయాలని లయన్స్ క్లబ్ 316–ఏ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ వర్మ, శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. 2024–25 సంవత్సరానికి లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కొత్త కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం జోన్ ఛైర్మన్ పొన్నాడ రవికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందంజలో ఉందన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ సేవారంగంలో లయన్స్‌క్లబ్‌కు ప్రత్యేకస్థానం ఉందన్నారు. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ మాట్లాడుతూ ఈ ఏడాది క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. తన సంపాదనలో సుమారు 20శాతం సమాజసేవకు వినియోగిస్తానన్నారు. నూతన కార్యవర్గంలో సురేష్‌తోపాటు కార్యదర్శిగా డాక్టర్ పైడి సింధూర, కోశాధికారిగా జోగి భారతి, ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, బరాటం విశ్వేశ్వరరావు, డైరెక్టర్ పొట్నూరు నరేష్, మార్కెటింగ్ ఛైర్‌పర్సన్‌గా ఉర్లాం శివతేజ, మెంబర్‌షిప్ ఛైర్‌పర్సన్‌గా బరాటం కృష్ణచైతన్య, క్లబ్ సర్వీస్ ఛైర్‌పర్సన్‌గా డాక్టర్ ఎం.కె.మిశ్రో ఎన్నికయ్యారు. కార్యక్రమంలో దుప్పల వెంకటరావు, ఎన్ని ధనుంజయరావు, పూడి తిరుపతిరావు, బలివాడ మల్లేశ్వరరావు, సనపల నరసింహమూర్తి, పీజే నాయుడు, అంధవరపు సంతోష్, చింతాడ రవికుమార్, లయన్స్ ప్రతినిధులు నటుకుల మోహన్, బాడాన దేవభూషణరావు, హారికా ప్రసాద్, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టళ్ల స్థితిగతులపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక

## రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలోని వివిధ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి, ఆయా శాఖల ఉన్నతాధికారులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు సారథ్యంలో నివేదికలు అందజేయనున్నట్లు కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఆదివారం బలగలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, బీసీ సంక్షేమ హాస్టళ్లను సీతారాం ఆకస్మికంగా పరిశీలించి విద్యార్థులతో భేటీ అయ్యారు. అక్కడి విద్యార్థులకు అమలు జరుగుతున్న మెనూపై ఆరా తీశారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ తమ కమిషన్ సారథ్యాన గ్రామ, మండల, పట్టణ ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న తాత్కాలిక, దీర్ఘకాలిక సమస్యలపై పూర్తి సమాచారాన్ని సేకరించే పనిలో ఉన్నామన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి అనురాధ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ సహాయ అధికారి ఆర్.కృష్ణవేణి మాట్లాడుతూ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుల ఆదేశాలు, సూచనలు, సలహాలను అనుసరించి రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషిచేస్తామన్నారు. పర్యటనలో గిరిజన సంక్షేమ అధికారి ఎం.శ్రీనివాసరావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు జనార్ధన్, కృష్ణమూర్తి, సీఆర్పీఎఫ్ ప్రధాన కార్యదర్శి మొదలవలస వాసుదేవ కుమార్, కార్యదర్శి సింగూరు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి వైద్యానికి రూ.55వేలు ఆర్థిక సాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)





నిజాంబాద్ గ్రామానికి చెందిన దుమ్ము లక్ష్మీనారాయణ, సాయమ్మ దంపతుల మూడేళ్ల కారుణ్య అనే చిన్నారికి ఇటీవల ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు అన్ని పరీక్షలు జరిపి బ్లడ్ కేన్సర్ అని తెలిపారు. ప్రస్తుతం పాప వైజాగ్ మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వీరిది నిరుపేద కుటుంబం. మందుల ఖర్చుకు కూడా డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న టెక్కలి అభయం యువజన సేవా సంఘం వెంటనే స్పందించి దాతల ద్వారా సేకరించిన రూ.55 వేలు చిన్నారి వైద్యానికి ఆమె మేనమామ శివకు అందించారు. కార్యక్రమంలో అభయం యువజన సేవా సంఘ అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు, సెక్రటరీ లాడి కామేశ్వరరావు, ట్రెజరర్ శ్రీనివాస్ బెహరా, తిరుమల ఫ్యామిలీ మాల్ అధినేత అంధవరపు కిషోర్, సంఘ సభ్యులు ఎన్.సింహాచలం, డి.పూర్ణాచారీ, మున్నా, ఎస్.రాజేష్, అద్దాలు వీరభద్రాచారి, యు.గోవిందరావు, ఎస్.జీవన్ పాల్గొన్నారు.



27వ డివిజన్‌లో తల్లిపాల వారోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి గంగు రమణారావు, శిమ్మ నర్సింహమూర్తి, గుత్తు చిన్నారావు, జనార్ధన, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్

## ఆక్రమణదారులుపై చర్యలు తీసుకోవాలి

### - గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన ఎంపీపీ చిరంజీవి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎచ్చెర్ల మండలం దుప్పలవలస రెవిన్యూ పరిధిలో సర్వేనెంబర్ 97/9, 10,11లో ఉన్న చెరువును పెయ్యాలవానిపేట గ్రామానికి చెందిన దుంగ సుదర్శనరావు, సరస్వతి ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని సోమవారం గ్రీవెన్స్‌లో అధికారులకు ఎంపీపీ చిరంజీవి ఫిర్యాదు చేశారు. మైనింగ్ అనుమతులు లేకుండా ప్రైమరీ స్కూల్ నిర్మాణం కోసం నారాయణపురం రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ 15/2,34లో దుంగ సుదర్శనరావు, సరస్వతి అక్రమ మైనింగ్ జరిపి గ్రావెల్ తరలిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నారాయణ పురం సర్వే నెంబర్ 15/2,3,4లో గాడు రామారావు, చౌదరి బాబ్జి కలిసి 20 ఎకరాలలో అక్రమంగా మైనింగ్ జరిపి సహజవనరులను దోపిడీ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. నారాయణపురం ఆనకట్ట కుడి కాలువ పరిధి శివారు గ్రామాలైన కొత్తపేట, ముద్దాడ, పొన్నాడ కొంగరాం, ధర్మవరం, బొంతలకోడూరు, భగీరథపురం గ్రామాల ఆయకట్టుకు సాగునీరు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పొన్నాడ పంచాయతీ వెంకన్నగారిపేట వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి శివారు గ్రామాలకు సాగునీటి కష్టాలు తప్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో వైకాపా మండల అధ్యక్షులు ముద్దాడ శంకర్, వైస్ ఎంపీపీ బెందు రామారావు, సీనియర్ నాయకులు బొడ్డేపల్లి సుధాకర్, నేతింటి నీలమప్పుడు, కన్నప్పడు, అల్లు సూర్యనారాయణ, నక్క వైకుంఠం, భూషణం తదితరులు పాల్గొన్నారు.



# ‘దత్తు’డిని తెచ్చాడు.. భూమి కొట్టేశాడు!

మనకున్న సెంటు స్థలం మనదేనని నిరూపించుకోవాలంటే సవా లక్ష ప్రశ్నలు, వందలకొద్దీ ప్రదక్షిణలు, పదులసార్లు సర్వేలు చేయించినా ముప్పుతిప్పలు పెట్టిగానీ రెవెన్యూ యంత్రాంగం ధ్రువీకరణ పత్రం ఇవ్వదు. అదే ‘వేరే వాడి భూమి కాజేస్తున్నాను.. అందులో మీకూ వాటా ఇస్తాను’ అని చెబితే చాలు.. చెలరేగిపోయి ఆగమేఘాల మీద రికార్డులు మార్చేసి కోట్లాది రూపాయల విలువైన భూములను ఆక్రమార్కులకు దారాధత్తం చేసేసి లక్షలాది రూపాయలు తీసుకొని ఎంచక్కా పాము చావకుండా, కర్ర విరగకుండా తీర్పులిస్తుంటారు. మొన్నటికి మొన్న నగరానికి చెందిన కస్పా రమాప్రభు వ్యవహారంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం అనుసరించిన సూత్రాన్నే ఇప్పుడు సింగుపురంలో కోట్లు విలువ చేసే మరో 72 సెంట్ల భూమి కథను కూడా అదే సూత్రంతో నడిపించారు. వారసుల్లేని దంపతులకు.. వారు చనిపోయిన పదేళ్లకు దత్తపుత్రుడిని సృష్టించి ఆయన పేరిట భూమిపత్రాలు పుట్టించి, ఆమ్మి వేయించిన చరిత్ర స్థానిక తహసీల్దార్ కార్యాలయానిది. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఒకరికి, ఆస్తికి వారసత్వ హక్కును వేరొకరికి ఇచ్చి ఇద్దరి జుట్లకు ముడేసిన పాత తహసీల్దార్ వ్యవహారాలు ఇప్పుడిప్పుడే ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఇందుకు ఉదాహరణ ఈ కథనం.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రూరల్ మండలం సింగుపురం రెవెన్యూ సర్వే నెంబర్ 284/4, 5,6లో ఉన్న 72 సెంట్ల భూమి అదే గ్రామానికి చెందిన గొంటి కుష్టయ్య, కొండమ్మ దంపతులకు పూర్వీకుల నుంచి వారసత్వంగా సంక్రమించింది. సంతానం లేని ఈ దంపతుల్లో కుష్టయ్య 2014లో, కొండమ్మ 2015లో చనిపోయారు. వారసులు లేకపోవడంతో చనిపోయే వరకు తమ సమీప బంధువుల ఇంట్లోనే కాలం వెళ్లదీశారు. అనంతరం ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం బంధువులు దరఖాస్తు చేసుకుంటే విచారణ అనంతరం రెవెన్యూ యంత్రాంగం కుష్టయ్య వారసులుగా కొందర్ని గుర్తించి, వారి పేరిట ధ్రువపత్రం అందజేసింది. రెవెన్యూ రికార్డుల ప్రకారం కుష్టయ్య, కొండమ్మలకు చెందిన 72 సెంట్ల భూమికి వారసులు వీరే అవుతారు. ఈ వారసత్వ కథను ఇక్కడే పాత తహసీల్దార్ మార్చేశారు. రోడ్డు ఫేసింగ్‌లో ఉన్న ఒదున కోట్ల విలువ చేసే ఈ 72 సెంట్ల భూమిపై కన్నేసిన ఓ కబ్జాదారుడు రెవెన్యూ యంత్రాంగాన్ని కలిసి డీల్ మాట్లాడుకున్నాడు. అంతే.. పిల్లలు లేని దంపతులకు.. అదీ వారు చనిపోయిన పదేళ్ల తర్వాత ఓ దత్తపుత్రుడు తెరపైకి వచ్చాడు. ఆయన పేరు మీద ఆధార్ కార్డు సృష్టించి, 72 సెంట్ల భూమిని ఆయన పేరిట రాసేశారు. ఈ వ్యవహారంలో సూత్రధారిగా ఉన్న వ్యక్తి భార్య ఆయన్నుంచి ఈ భూమిని కొనుగోలు చేసినట్లు రికార్డులు పుట్టించారు. కాగా ఫ్యామిలీ సర్టిఫికెట్ పొందినవారు దాని ఆధారంగా ఆ భూమి రిజిస్ట్రేషన్ చేయించి మ్యూటేషన్ చేయాలంటూ రెవెన్యూ కార్యాలయానికి దరఖాస్తు పెట్టుకుంటే.. ఇంకెక్కడి భూమి.. ఎప్పుడో ఆయన వారసుడు రాజారావు అమ్మేశాడని కార్యాలయ వర్గాలు చావు కబురు చల్లగా చెప్పాయి. దాంతో ఈ వ్యవహారం వివాదంలోకి వెళ్లిపోయింది.

### దత్తత పేరుతో నాటకం

మృతిచెందిన కుష్టయ్య, కొండమ్మ తదనంతరం వారి కుటుంబ సభ్యులుగా ఫ్యామిలీ సర్టిఫికెట్ పొందినవారు వెల్లడించిన వివరాలు, చేసిన ఆరోపణల ప్రకారం.. నకిలీ దత్తపుత్రుడి సృష్టి వెనుక సింగుపురానికే చెందిన రైల్వే ఉద్యోగి పాపారావు హస్తం ఉంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అయినప్పటికీ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే పాపారావు ఫోర్జరీ సంతకాలతో రెవెన్యూ పత్రాలు, పాస్‌పుస్తకాలు సృష్టిస్తుంటాడనే ఆరోపణలు ఉన్నాయి. కుష్టయ్య, కొండమ్మ దంపతులకు చెందిన 72 సెంట్ల భూమి ఉన్నట్లు గుర్తించిన అతగాడు వారు దాన్ని కాజేసేందుకు పథకం రచించాడు. మృతిచెందిన పదేళ్ల తర్వాత వారి వారసుడంటూ ఒక వ్యక్తిని తెరపైకి తీసుకువచ్చాడు. కుష్టయ్య, కొండమ్మ దంపతులు జీవించి ఉన్నప్పుడు అతగాడిని దత్తత తీసుకున్నట్టు ఫోర్జరీ పత్రాలు సృష్టించారని ఆరోపణలు ఉన్నాయి. ఇంటి పేరు, తండ్రి పేరు మార్చి ఆధార్ కార్డు కూడా పుట్టించి దాని ఆధారంగా రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై 72 సెంట్ల భూమి కొట్టేశాడని బాధితులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి సంతానం లేని కుష్టయ్య, కొండమ్మ చనిపోయే వరకు అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల పిల్లలపై ఆధారపడి జీవనం సాగించారు. వీరిద్దరికీ పిత్రార్జితంగా అందిన ఆస్తిలో కొంత విక్రయించగా మృతిచెందే నాటికి 72 సెంట్లు మిగిలింది. 2014లో కుష్టయ్య మృతిచెందిన తర్వాత కుష్టయ్య అన్నదమ్ములు, అక్కచెల్లెల పిల్లలకు ఆ 72 సెంట్ల భూమి దఖలుపరుస్తూ కొండమ్మ వీలునామా రాసిచ్చినట్టు గొంటి వారసులు చెబుతున్నారు. అయితే రైల్వే ఉద్యోగి పాపారావు దాన్ని కాజేసేందుకు పన్నాగం పన్నాడు. 2019లో పాపారావు తన తండ్రి పేరుతో సర్వే నెంబర్ 284/4, 5, 6లో ఉన్న 72 సెంట్లకు శిస్తు కట్టినట్టు నకిలీ రశీదులు సృష్టించాడని బాధిత కుటుంబీలు ఆరోపిస్తున్నారు.

### ఫోర్జరీ సంతకాలు.. నకిలీ పత్రాలు

అక్కడితో ఆగకుండా కొండమ్మ 2014లో రాసినట్టు బాధితులు చూపిస్తున్న వీలునామాలో భాగస్వామి అయిన బోరుభద్ర గంగులు కుమారుడు రాజారావుకు డబ్బులు ఆశ చూపించి లొంగదీసుకున్న పాపారావు దత్తత కథకు తెరతీశాడు. కుష్టయ్య, కొండమ్మ దంపతులు రాజారావును దత్తత తీసుకున్నట్టు నకిలీ పత్రాలు సృష్టించారు. దీన్ని ఆధారంగా చూపించి రాజారావు ఇంటి పేరు అయిన బోరుభద్రను గొంటిగా మార్చారు. అదేవిధంగా తండ్రి పేరు గంగులు కాగా దాన్ని మార్చి కుష్టయ్య పేరును చేరుస్తూ 2022 డిసెంబర్ ఆరో తేదీన ఆధార్ కార్డులో మార్పులు చేయించాడు. దాన్ని చూపించి రెవెన్యూ అధికారులను మేనేజ్ చేసి అడంగల్‌లో కొండమ్మ స్థానంలో రాజారావు పేరును చేర్పించాడు. ప్రభుత్వ జారీ చేసినట్టు చూపిస్తూ ఫోర్జరీ సంతకాలతో పాస్‌బుక్ కూడా తయారు చేయించాడు. రికార్డులన్నీ మార్చేసిన తర్వాత 2023 మే ఆరో తేదీన శ్రీకాకుళం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గొంటి కుష్టయ్య కుమారుడు రాజారావుగా చూపించి వారి 72 సెంట్ల భూమిని రైల్వే ఉద్యోగి పాపారావు భార్యకు అమ్మినట్లు 3809/23 నెంబర్‌తో క్రయ డాక్యుమెంట్ రిజిస్టర్ చేయించారు.

### పోలీసులను, కోర్టును ఆశ్రయించినా..

గ్రామంలో ఎవరికీ తెలియకుండా పాపారావు గుట్టుగా తతంగం నడుపుతున్న సమయంలోనే కుష్టయ్య, కొండమ్మల వారసులుగా కుష్టయ్య అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల పిల్లల పేరుతో రెవెన్యూ అధికారులు 2022 డిసెంబర్ 22న ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీచేశారు. గ్రామంలో విచారణ జరిపి, గ్రామ పెద్దల సాక్ష్యాల ఆధారంగానే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇచ్చారు. దాని ఆధారంగా కుష్టయ్య వారసులు 2023 జనవరి, సెప్టెంబర్ నెలల్లో సర్వే నెంబర్ 284/4, 5, 6లో ఉన్న 72 సెంట్ల భూమిని తమ పేరిట రిజిస్టర్ చేయించి, అడంగళ్లు కూడా మార్పించుకున్నారు. వీటి ఆధారంగా మ్యూటేషన్ చేయాలని తహసీల్దార్ కార్యాలయానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. ఈ విషయం తెలుసుకున్న పాపారావు కుష్టయ్య వారసుల నుంచి తాము ఆ భూమి కొనుగోలు చేశామంటూ మ్యూటేషన్‌కు అభ్యంతరం తెలుపుతూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పాపారావు అడ్డగోలు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఎప్పుడో పదేళ్ల క్రితం మృతి చెందిన కుష్టయ్య, కొండమ్మలకు పదేళ్ల తర్వాత వారసుడు తెరపైకి రావడమేంటంటూ గతనెల ఆరో తేదీన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పొందిన వారు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు పాపారావును పిలిపించి వివరణ కోరగా రాజకీయ పలుకుబడితో మేనేజ్ చేసేందుకు ప్రయత్నించాడు. అప్పటినుంచి బాధితులు న్యాయం కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గ్రామంలో పెద్దలంతా కుష్టయ్య అన్నదమ్ముల కుమారులకు మద్దతుగా నిలిచినా పాపారావు వారిందరికీ ఎదురు తిరిగినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించి వివాదాస్పద భూమిలో నోటీసు బోర్డులు పెట్టినా వాటిని దౌర్జన్యంగా తొలగించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో పాపారావు బాధితులు అనేక మంది ఉన్నారని, వారు కూడా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధపడుతున్నట్టు చెబుతున్నారు.

# తల్లిపాల ఆవశ్యకతను గుర్తించాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తల్లిపాల ఆవశ్యకతను గుర్తించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. నగరంలోని బలగ సెక్టార్ భావాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నాలుగో వార్డు ఇన్‌చార్జ్ రెడ్డి సూర్యనారాయణ, శంకర్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిపాల ద్వారా శిశువులో రోగనిరోధక శక్తిని పెరుగుతుందన్నారు. బిడ్డకు పాలివ్వడం వల్ల తల్లీ,బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. శిశువుకు మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలనే ఆహారంగా అందించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో శోభారాణి, టీడీపీ నాయకులు చిట్టి నాగభూషణం, తంగి నర్సింగరావు, రెడ్డి ఆమని, సాధు కోటి, సాధు పరమేశు, కోలా చిరంజీవి, సాధు అజయ్, తంగి గణేష్, రావాడ పురుషోత్తం, కెవిఎస్ నాయుడు, మురళి, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింల సమస్యలు పరిష్కరించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో ముస్లిం మైనార్టీ నాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మైనార్టీ నాయకులు ఆదివారం కేంద్ర మంత్రి రామును కలిసి క్యాంపు కార్యాలయంలో వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిరమండలంలో స్మశానవాటిక స్థలము మంజూరు, కోటబొమ్మాళి మండలం పాకివలస గ్రామంలో మసీదుకు వెళ్లేందుకు రహదారి, స్మశానవాటిక చుట్టూ ప్రహరీ నిర్మాణంకు నిధులు మంజూరు చేయాలని కోరారు. నరసన్నపేట మసీదుకు ఆనుకొని ఉన్న ప్రభుత్వస్థలాన్ని స్మశానవాటికకు కేటాయించాలని కోరారు. ముస్లింల మ్యారేజ్ సర్టిఫికెట్‌లో ఉర్దూతో పాటు ఇంగ్లీషు, తెలుగు ముద్రించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు సయ్యద్ సిలర్, మహమ్మద్ జీలాని, షేక్ మొహమ్మద్ గౌస్, షేక్ మొహమ్మద్, షేక్ మస్తాన్, సయ్యద్ నాగు, షేక్ మదీనా, షేక్ అబ్దుల్లా, మొహమ్మద్ వాజిద్, ఎండి రఫీ, షేక్ అబ్బురహీం, షేక్ నిజాముద్దీన్, బహదూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



## బొత్స కోసం కసరత్తు ప్రారంభం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక సంస్థల కోటా నుంచి వైకాపా తరపున ఎమ్మెల్సీగా ఎన్నికల బరిలో నిలిచిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ గెలుపు కోసం ఆ పార్టీ నేతలు అప్పుడే కసరత్తులు ప్రారంభించారు. ఇందులో భాగంగా సోమవారం పాడేరు నియోజకవర్గ పరిధిలో ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీలతో సమావేశం నిర్వహించారు. విజయనగరం జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను), మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వర రాజు, కుంభా రవిబాబుతో పాటు జిల్లా వైకాపా యువజన విభాగం అధ్యక్షుడు మెంటాడ స్వరూప్ స్థానిక నేతలతో సమావేశమయ్యారు. 814 ఓట్లకు గాను 615 ఓట్లు వైకాపాకు ఉన్నాయని, వీటిని చీలకుండా బొత్స సత్యనారాయణకు పడేటట్లు నాయకులంతా వ్యవహరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



## ఓబీసీ కులగణన చేపట్టాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



దేశంలో ఓబీసీ జనాభా వివరాలను లెక్కకట్టడానికి జనగణన చేయాలని ఓబీసీ సంఘం నాయకులు రౌతు శంకరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్వాతంత్రం వచ్చిన పుటి నుంచి నేటివరకు కులగణన చేపట్టకపోవడం శోచనీయమన్నారు. 1953 సంవత్సరంలో కాకా కల్కేకర్, 1978లో బి.పి.మండల్ కులగణన అత్యంత అవసరమని తేల్చి చెప్పిందని గుర్తు చేశారు. ఓబీసీ కులగణన ద్వారా వివిధ కులాల జనాభా, సామాజిక స్థితిగతులు తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. కులగణన చేయకపోవడం వల్ల అభివృద్ధి పథకాలకు ఎంతోమంది దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2010లో బీజేపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, 2011లో జనగణనలో ఓబీసీ కులగణన చేపట్టాలని యుపీఏ సర్కారుపై ఒత్తిడి తెచ్చిందని గుర్తు చేశారు.

# రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుంది

### - నిధులు లేవని హమీలు గాలికొదిలేశారు
### - మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)



రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆరోపించారు. సోమవారం వైకాపా జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైకాపా అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ఎన్డీఏ ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై అసత్య ప్రచారం చేసి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని ధ్వజమెత్తారు. చంద్రబాబు హయాంలో గ్రామాల్లో మద్యం ఏరులై పారింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గ్రామాల్లో సచివాలయం వ్యవస్థను ప్రవేశ పెట్టి గ్రామస్వరాజ్యం తెచ్చిన ఘనత వైకాపాకే దక్కిందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారిపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు లేవని చెప్పి ఎన్నికల్లో ఇచ్చిన హమీలను గాలికొదిలేశారని దుయ్యబట్టారు. రైతు భరోసా ఎప్పుడు జమ చేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎంతమందికి ఇస్తారో ఇప్పటికీ స్పష్టత లేదన్నారు. మెగా డీఎస్సీతో ఎంతమందికి ఎన్ని ఉద్యోగాలు ఎప్పటికి కల్పిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాలో టీడీపీ నాయకులే ఇసుకను ఆక్రమంగా తరలించుకుపోతున్నారని ఆరోపించారు. ఉచిత ఇసుక పేరు చెప్పి టీడీపీ నాయకులకు మేలు చేసే విధానాన్ని తీసుకు వచ్చారని దుయ్య బట్టారు. సమావేశంలో పార్టీట జిల్లా ఉపాధ్యక్షులు రౌతు శంకర్రావు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ వద్ద స్కీమ్ వర్కర్ల ధర్నా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, అక్రమంగా తొలగించినవారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్. అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణ ఆధ్వర్యంలో ధర్నా చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశ, విఓఏలు (వెలుగు), ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన వంట కార్మికులు, స్కూల్ స్వీపర్లు తదితర కార్మికులపై గ్రామాలలో రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాజకీయకక్షలతో అక్రమంగా తొలగిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు కక్షసాధింపు చర్యలు, దౌర్జన్యాలు ఉండవని అసెంబ్లీలో చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. సంతబొమ్మాళి మండలంలోని గద్దెలపాడు గ్రామంలో అంగన్‌వాడీ టీచర్, ఆయా, ఆశా, విఓఎ, మధ్యాహ్న భోజన బడి భోజనం వంట కార్మికులను తొలగిస్తామని, ఒక్కో ఉద్యోగానికి రూ. 50వేలు నుంచి రూ. 1.90లక్షలు వేలంపాట పెట్టారన్నారు. టెక్కలి -2 సెంటర్ అంగన్వాడీ, గార మండలం శ్రీకూర్మం పంచాయతీ ముద్దాడపేట మినీ అంగన్వాడీ వర్కర్‌ను, సంతబొమ్మాళి మండలం బోరుభద్ర పి.హెచ్.సి పరిధిలో సీపురం గ్రామ ఆశ వర్కర్‌ను, పలాస మండలంలో కిస్టుపురం, వజ్రపుకొత్తూరు మండలంలో కొండపల్లి ఆశ వర్కర్‌లను రాజీనామా చేయాలని బెదిరిస్తూ వేధిస్తున్నారని ఆరోపించారు. జిల్లావ్యాప్తంగా అనేకచోట్ల టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నట్టు ధర్నా అనంతరం డి.ఆర్.ఒ అప్పారావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు అల్లు మహాలక్ష్మి ఎన్.గణపతి, ఎన్.వి.రమణ, కె.సూరయ్య, సిఐటియు నగర కన్వీనర్ ఆర్.ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.